సాక్షి
సూర్యాపేట
సోమవారం ၊ 17 ၊ ఏప్రిల్ ၊ 2023



ప్రమాద తీవ్రత తగ్గించేలా..
ప్రమాదం జరిగితే తీవ్రత తక్కువగా ఉండేలా సరికొత్త టెక్నాలజీతో కాంపోజిట్ సిలిండర్లు మార్కెట్‌లోకి వచ్చాయి. - 8లో



ప్రాతినిధ్యం పెరగాలి
న్యాయ వ్యవస్థలో అట్టడుగు వర్గాల ప్రాతినిధ్యం పెరగాలని సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
42°/23°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



ఇఫ్తార్ 6-38
(సోమవారం సాయంత్రం)
సహర్ 4-33
(మంగళవారం ఉదయం)

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

సూర్యాపేట టౌన్: ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ఈ వేసవిలోనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేటలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా, పెన్షన్ విధానాలతోపాటు జిల్లాలో ఉపాధ్యాయుల అక్రమ సర్దుబాట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు సకాలంలో అందజేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు గతంలో మాదిరిగా స్కావెంజర్లను నియమించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.సోమయ్య, ఎస్.అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జి.వెంకటయ్య, యాకయ్య, ఎస్‌కే.సయ్యద్, వీరారెడ్డి, వెంకన్న, పాపిరెడ్డి, నాగేశ్వర్‌రావు, రమేష్, ఆడమ్, సాంబయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూర్(ఎస్): తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఉపకరణాల కోసం అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. జహీర్‌బాబా కోరారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మోటార్ వెహికిల్, బ్యాటరీ వీల్‌చైర్, స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డైసీ ప్లేయర్, ట్రైసైకిల్, వినికిడి యంత్రం, చేతి కర్రలు, చంక కర్రలు, స్మార్ట్ కేన్స్‌లాంటి ఉపకరణాల కోసం సదరం, కులం, ఆదాయం, విద్యార్హత సర్టిఫికెట్లు, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డుతోపాటు పాస్ ఫొటోతో ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట వీహెచ్‌పీఎస్ నాయకులు కళింగరెడ్డి, కృష్ణమూర్తి, వెంకన్న, సైదులు తదితరులు ఉన్నారు.

పేదలను మోసం చేస్తున్న బీజేపీ



తిరుమలగిరి : ప్రజా చైతన్యయాత్రలో పాల్గొన్న సీపీఐ నాయకులు

తిరుమలగిరి(తుంగతుర్తి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేద ప్రజలను మోసం చేస్తుందని, ధరలు విపరీతంగా పెంచడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్ అన్నారు. 'బీజేపీ కో హఠావో.. దేశ్ కో బచావో' పేరిట హైదరాబాద్‌లో ఈ నెల 14న ఇంటింటికీ సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఆదివారం తిరుమలగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రత, లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలకు, ప్రభుత్వరంగ సంస్థల విధ్వంసానికి బీజేపీ ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. 2024 ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్యయాత్ర నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లంల యాదగిరి, ఎం.లక్ష్మయ్య, కె.మల్లయ్య, ప్రభాకర్, శ్రీకాంత్, ఎక్బాల్, పున్నయ్య, రాజారాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న భానుడు

- వారం నుంచి పెరుగుతున్న ఎండలు
- ఆదివారం గరిష్టంగా హుజూర్‌నగర్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- నాలుగైదు మండలాలు మినహా అంతటా 40 డిగ్రీలపైనే..
- మధ్యాహ్నం వేళ రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్న జనం



సూర్యాపేటలో ఎండ వేడిమికి తాళలేక తలకు టవల్స్ కట్టుకొని వెళ్తున్న ప్రయాణికులు

భానుపురి(సూర్యాపేట): భానుడు భగ్గుమంటున్నాడు. ఆదివారం తన ప్రతాపాన్ని చూపడంతో రికార్డు స్థాయిలో ఎండలు మండాయి. జిల్లాలోని దాదాపు 17 మండలాల్లో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా హుజూర్‌నగర్ మండలం లక్కవరం రోడ్డులో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో 5 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఎండలు ఉండడంతో ప్రజలు రోడ్లపైకి రాలేని పరిస్థితి నెలకొంది. ఉదయం 10గంటల నుంచే భానుడు మండిపోతుండడంతో నిత్యం రద్దీగా ఉండే రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. ఉపాధి హామీ, ఇతర వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు ఎండలకు బెంబేలెత్తిపోతున్నారు. వారం నుంచి ఇదే పరిస్థితి ఉండగా.. వృద్ధులు, చిన్నారులు తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

17 మండలాలు ఆరెంజ్ జోన్‌లోనే..

జిల్లాలో వారం రోజులుగా ఎండలు తీవ్రమయ్యాయి. పలు మండలాల్లో 38 నుంచి 40 డిగ్రీల వరకు నమోదైంది. ఇక ఈనెల 13వ తేదీన ఆరేడు మండలాల్లో 42 డిగ్రీలు, మరో ఐదారు మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదే విధంగా ఎండ తీవ్రత పెరిగి ప్రస్తుతం జిల్లాలోని 17 మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. ఇందులో అత్యధికంగా హుజూర్‌నగర్ మండలం లక్కవరం రోడ్డులో 44.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో 40.9 డిగ్రీలు, మఠంపల్లిలో 40.9, నాగారం మండలం ఫణిగిరిలో 40.9, పెన్‌పహాడ్ మండలం చీదేళ్లలో 40.8, జాజిరెడ్డిగూడెం మండలంలో 40.8, ఆత్మకూర్ (ఎస్) మండలంలో 40.6, అనంతగిరి మండలం గొంద్రియాలలో 40.6, సూర్యాపేట మండలం టేకుమట్లలో 40.5, బలరాంతండాలో 40.4, యర్కారంలో 40.2, చింతలపాలెం మండలం దొండపాడులో 40.3, చివ్వెంల మండలం బి.చందుపట్లలో 40.2, నేరేడుచర్ల మండలం ముకుందాపురంలో 40.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నిర్మానుష్యంగా రహదారులు

గత వారం పదిరోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో జనం అల్లాడిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. అత్యవసరం ఉంటేనే తప్ప ఎవరూ బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో బయటకు వచ్చిన ఉదయం 11గంటలకే ఇళ్లకు చేరేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సమయంలో ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు జనం నానాపాట్లు పడుతున్నారు. రక్షణగా గొడుగులు, టోపీలు, హెల్మెట్లను ధరించడంతో పాటు చల్లదనం కోసం నిమ్మ, చెరుకు రసాలను తీసుకుంటున్నారు. ఇళ్లు, దుకాణాల్లో ఉంటున్నప్పటికీ ఎండ తీవ్రత కారణంగా కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు.

ఆదివారం 41 డిగ్రీలకు పైగా నమోదైన ప్రాంతాలు

మండలం	గ్రామం	గరిష్టం
హుజూర్‌నగర్	లక్కవరం రోడ్డు	44.0
పెన్‌పహాడ్	పెన్‌పహాడ్	42.5
మఠంపల్లి	పెదవీడు	42.5
మునగాల	మునగాల	42.4
కోదాడ	తొగర్రాయి	42.0
చిలుకూరు	చిలుకూరు	42.0
మోతె	మామిళ్లగూడెం	41.5
నడిగూడెం	నడిగూడెం	41.4
చివ్వెంల	తిరుమలగిరి	41.3
నేరేడుచర్ల	నర్సయ్యగూడెం	41.3
మేళ్లచెరువు	మేళ్లచెరువు	41.2
మోతె	ఉర్లుగొండ	41.2
అనంతగిరి	శాంతినగర్	41.1
పాలకవీడు	అలింగాపురం	41.0



నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే సూర్యాపేటలోని ఈద్గా రోడ్డు ఆదివారం మధ్యాహ్నం ఇలా వెలవెలబోయి కనిపించింది

కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల, ఎమ్మెల్యేలు బొల్లం, గాదరి, శానంపూడి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

కోదాడ: పోరాడి సాధించుకున్న తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్షగా నిలుస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కోదాడ పట్టణ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లక్షా 32 వేల 649 ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఏకకాలంలో 23 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. మరో 90 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు జారీ చేయగా ప్రతిపక్షాలు లీకేజీ కుట్రతో నిరుద్యోగుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని ఆరోపించారు. 2014 ఎన్నికల సమయంలో రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని బీజేపీ నాయకులు ప్రకటించారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో 10 సంవత్సరాల కాలంలో కనీసం 10 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ఎద్దేవా చేశారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీకి వారసుడిగా చెప్పుకుంటున్న రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసినా కాంగ్రెస్ నాయకులకు చీమకుట్టినట్టు అయినా లేదని, వారు బీజేపీకి బీ టీంగా పని చేస్తున్నారని విమర్శించారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, తుంగతుర్తి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, శానంపూడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఆత్మీయ సమ్మేళనాల జిల్లా పరిశీలకుడు మెట్టు శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

చల్లని పైకప్పులు ఉండాల్సిందే..

- ఇళ్లలో వేసవి తాపాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు
- 600 గజాలు పైబడిన భవనాలపై కూల్‌రూఫ్‌లు తప్పనిసరి
- ఈ పథకాన్ని అమలు చేయాలని మున్సిపాలిటీలకు ఉత్తర్వులు జారీ



సూర్యాపేట మున్సిపాలిటీలోని భవనాలు

హుజూర్‌నగర్: ప్రస్తుత వేసవిలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణతాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా వేసవి ఉష్ణ ప్రభావాన్ని తగ్గించి ఇంట్లో చల్లదనం ఉండేలా భవనాలపై చల్లని పైకప్పు (కూల్ రూఫ్) నిర్మించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పట్టణాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాలోని మున్సిపాలిటీల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణాల్లోని భవనాల పైకప్పులకు తప్పనిసరిగా చల్లని పైకప్పు వేయించుకోవాలని, ఈ నెల 1వ తేదీ నుంచే అమలు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆ భవనాలకు తప్పనిసరిగా..

మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వ్యాపార, వాణిజ్య భవనాలకు కూల్‌రూఫ్‌ను తప్పనిసరిగా వేయాల్సిందే. 600 చదరపు గజాలు, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం ఉన్న నివాస భవనాలకు కూల్‌రూఫ్‌ను తప్పనిసరిగా వేయాల్సిందే అని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. 600 గజాల కన్నా తక్కువ ఉన్న నివాస భవనాల కూల్ రూఫ్ నిర్మాణం అనేది ఆయా భవన యజమానుల ఇష్టానికే వదిలివేశారు. వారికి ఇష్టం అయితే వేయించుకోవచ్చు. లేకుంటే లేదు. ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గృహ నిర్మాణ పథకాలకు దీనిని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. చల్లని పైకప్పు విధానాన్ని మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తారు. కూల్‌రూఫ్ (చల్లని పైకప్పు) నిర్మించుకున్న వాటికే మున్సిపల్ అధికారులు సంబంధిత ధ్రువ పత్రాలను జారీ చేయనున్నారు.

మున్సిపాలిటీల్లో భవనాలు ఇలా..

మున్సిపాలిటీ	వార్డులు	భవనాలు
సూర్యాపేట	48	33,062
కోదాడ	35	16,245
హుజూర్‌నగర్	28	7,479
తిరుమలగిరి	15	6,306
నేరేడుచర్ల	15	4,262
మొత్తం	141	67,354

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కూల్‌రూఫ్ పథకం అమలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆదేశాలను పట్టణంలో అమలు చేస్తాం. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారికి కూల్‌రూఫ్ నిర్మించుకుంటేనే అనుమతి పత్రాలు జారీ చేస్తాం. ఈ పథకాన్ని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

వైభవంగా సౌరహోమం

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, శ్రీనివాసశర్మ, భక్తులు పాల్గొన్నారు.



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

175 స్కూళ్లలో డిజిటల్ బోధన!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుకు శ్రీకారం
- విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపునకు విద్యాశాఖ నిర్ణయం
- దృశ్యరూప పరికరాలు అమర్చేందుకు సన్నాహాలు



నాగారం: వచ్చే విద్యా సంవత్సరం నుంచి సర్కారు పాఠశాలల్లో 1నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గడిచిన విద్యాసంవత్సరంలో ఇప్పటికే పలుచోట్ల 9, 10 తరగతలకు ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలని మౌలిక వసతుల కల్పనకు మన ఊరు–మనబడి, మన బస్తీ–మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఒకపక్క మన బడి పనులు కొనసాగుతుండగానే మరోపక్క వచ్చే సంవత్సరంలో మిగతా అన్ని తరగతులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలో మొత్తం 175 పాఠశాలలను ఎంపిక చేశారు.

విషయ పరిజ్ఞానం పెంపునకే..

జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కారు పాఠశాలల్లో చదివే 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు పూర్తిస్థాయిలో విషయ పరిజ్ఞానం పెంపొందించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇందులో భాగంగా దృశ్య రూపంలో డిజిటల్ బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ప్రధానంగా 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థుల సౌలభ్యం కోసం ముందుగా దృశ్యరూప బోధనకు సంబంధించిన వివిధ అత్యాధునిక పరికరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

విద్యార్థులకు ఎంతో మేలు



ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అందుబాటులోకి రావడంతో పిల్లలకు ఎంతో మేలు చేకూరనుంది.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

సమకూరనున్న సౌకర్యాలు ఇవే..

- ప్రతి విద్యాలయానికి 75 ఇంచులు కలిగిన మూడు మానిటర్లు అందనున్నాయి.
- కేవీ యూపీఎస్‌లు, ఒక మెటల్ ఫ్రేమ్‌తో కూడిన బోర్డు మంజూరు కానుంది.
- యాప్‌ల సహాయంతో పాఠాలు బోధించేందుకు వైఫై సౌకర్యం కల్పిస్తారు.
- స్మార్ట్‌క్లాస్ రూంలలో నాలుగు ట్యూబ్ లైట్లు, రెండు ఫ్యాన్లు సమకూరుస్తారు.
- డిజిటల్ బోధనకు సంబంధించి జిల్లాలోని ఎంపిక చేయబడిన అన్ని స్కూళ్లలో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి




సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

సూర్యాపేట టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో టీఎస్ సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ ఒకటి తర్వాత నియమితులైన ప్రతి ఉద్యోగి సీపీఎస్ పరిధిలోకి వస్తారని, ప్రస్తుతం లక్షా 70వేల మంది ఉన్నారన్నారు. దశాబ్దకాలంగా విన్నపాలకే పరిమితమైన సీపీఎస్ రద్దు అంశాన్ని పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు అనే నినాదంతో పోరుబాట పట్టామన్నారు. పాత పెన్షన్ సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తూ సీపీఎస్ అంతం .. మన పంతం అనే నినాదంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రసాద్, నర్సింహారావు, సతీష్‌కుమార్, విజయ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మాకూ.. పేస్కేల్ ఇవ్వండి

- ప్రభుత్వానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది మొర
- పదిహేడేళ్లుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన
- ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులతో సమానంగా జీతాలివ్వాలని వినతి
- జిల్లా వ్యాప్తంగా 154 మంది సిబ్బంది



మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌లకు వినతి పత్రం ఇస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు (ఫైల్)

అర్వపల్లి: గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి దుర్భరంగా మారింది. చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడి పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకం అమలులో వీరు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారు. వేలాదిమంది కూలీలను సమన్వయం చేస్తూ పనులు కల్పిస్తూ గ్రామాల అభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్నారు. అయినప్పటికీ తమకు పనికి తగిన వేతనాలు ఇవ్వడం లేదని ఎన్నో ఏళ్లుగా అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు.

ఐకేపీ, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే వేతనాలు ఇవ్వాలని..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించింది. వారి మాదిరిగానే తమకు కూడా పీఆర్సీ ప్రకటించి వేతనాలు ఇస్తూ తమ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా 17 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో ఉద్యోగులుగా చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తూ కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టే సుమారు 40 రకాల పనులను ఈజీఎస్ సిబ్బందే కీలకంగా ఉంటూ గ్రామాల్లో ప్రజలకు చేరేలా చూస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం, ఉపాధి పనులు, క్రీడా ప్రాంగణాల నిర్మాణంతోపాటు వివిధ పనులు విజయవంతం కావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని, అయినా ప్రభుత్వం తమకు నామమాత్రంగా వేతనాలు అందిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 154మంది..

జిల్లా వ్యాప్తంగా 154 మంది ఉద్యోగులు ఈ పథకంలో పనిచేస్తున్నారు. వీరిలో ఏపీఓలు 17మంది, సీఓలు 30మంది, టీఏలు 86మంది, ఈసీలు 18మంది, పీఓ, హెచ్ఆర్, పీఎస్‌లు ఒక్కొక్కరి చొప్పున పనిచేస్తున్నారు. వీరందరూ గత 17 ఏళ్లుగా ఈ పథకంలో కొద్దిపాటి వేతనాలతో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పేస్కేల్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అందుకు తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే అందుకు అనుగుణంగా నిధులు కేటాయించి పేస్కేల్ అమలు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

పేస్కేల్ అమలు చేయాలి



ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం పేస్కేల్ చేసిన విధంగానే ఉపాధి హామీ సిబ్బందికి కూడా అమలు చేయాలి. చాలీచాలని వేతనాలతో ఎంతో ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి హామీలో పనిచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

– బండి రామకృష్ణారెడ్డి, ఉపాధిహామీ ఉద్యోగుల సంఘం, జిల్లా జేఏసీ చైర్మన్

17 ఏళ్లుగా పనిచేస్తున్నాం..



ఉపాధి హామీ పథకంలో 17ఏళ్లుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్నాం. ఉపాధి కూలీలకు పనులు కల్పించడంతోపాటు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాం. ఐకేపీ, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా తమకు వేతనాలు ఇవ్వాలి.

– బూర్గుల శ్రీనివాస్, ఈజీఎస్ జేఏసీ, జిల్లా కోశాధికారి

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి : రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి–పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఎస్సీ హాస్టల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఛాతి ఎడమ వైపు ఐ లవ్ యూ పుష్ప అని పచ్చబొట్టుతో ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

చెరువులో పడి బాలుడు మృతి

సూర్యాపేట క్రైం : చెరువులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని మామిళ్లగడ్డకు చెందిన సుజాత కుమారుడు సాయితేజ(08) తమ్ముడు కళ్యాణ్‌శ్రీనివాస్‌తో కలిసి ట్యాంక్‌బండ్ సద్దుల చెరువు పైకి వచ్చారు. ఆడుకుంటూ సాయితేజ ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడ్డాడు. వెంటనే కళ్యాణ్‌శ్రీనివాస్ ఇంటికి వచ్చి తల్లికి సమాచారం అందజేశారు. చెరువు దగ్గరకు వెళ్లే సరికి అప్పటికే సాయితేజ మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరకొండ (చందంపేట): అనుమతులు లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని నేరేడుగొమ్ము పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర నుంచి ఆదివారం తెల్లవారుజామున నేరేడుగొమ్ము మండల పరిధిలోని పోలేపల్లి వైపునకు బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మండల పరిధిలోని తిమ్మాపురం వద్ద వాహనాన్ని తనిఖీ చేసి 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం వ్యాపారుల రిమాండ్

నాగార్జునసాగర్: ఆంధ్రా–తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో గల కొత్తబ్రిడ్జి మీదనుంచి తరలిస్తుండగా పోలీస్ చెక్‌పోస్టు వద్ద 9క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి సాగర్ పోలీసులు పట్టుకున్నారు. బియ్యం వ్యాపారులైన పలనాడు జిల్లా నర్సరావు పేటకు చెందిన నక్కబోయిన శ్రీనివాసరావు, ఓర్సుకోటేశ్వర్ రావు, పిట్టల రవిశంకర్, బత్తుల కోటేశ్వర్ రావు, బత్తులనాగరాజులను అరెస్టు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి ఆదివారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి (తుంగతుర్తి) : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బి.శివ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలోని బిక్కేరు వాగు శివారులోని వ్యవసాయ బోర్ల వద్ద ఇసుకను తీస్తుండగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని కేసులు నమోదు చేశారు.

ప్రమాద తీవ్రత తగ్గించేలా..

- మార్కెట్‌లో కాంపోజిట్ సిలిండర్లు
- 5నుంచి 10 కేజీల చొప్పున అందుబాటులో..
- ప్రమాద తీవ్రత 80 నుంచి 90శాతం తక్కువగా ఉండేలా రూపకల్పన



ప్రమాదరహిత కాంపోజిట్ గ్యాస్ సిలిండర్లు

కోదాడ: అనుకోని సంఘటనలో గ్యాస్ సిలిండర్ పేలితే జరిగే విధ్వంసం ఊహించలేనిది. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మారిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రాణనష్టం జరగకుండా ప్రమాద తీవ్రత అతి తక్కువగా ఉండే విధంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇండేన్ గ్యాస్ విభాగం సరికొత్త టెక్నాలజీతో కాంపోజిట్ సిలిండర్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఐదు, పది కేజీల్లో లభించే ఈ సిలిండర్లు ఆధునిక టెక్నాలజీతో తయారు చేయడమే కాకుండా ప్రస్తుతం వాడే ఉక్కు సిలిండర్ల బరువులో సగానికి కన్నా తక్కువగా ఉండడం వీటి ప్రత్యేకత.

ఏమిటీ ఈ కాంపోజిట్ సిలిండర్లు

ప్రస్తుతం ఇంటి అవసరాలకు వాడే సిలిండర్లను ఉక్కుతో తయారు చేస్తుంటారు. ప్రమాదంలో ఇవి పేలితే ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా ఉంటున్నాయి. వీటిని నివారించడానికి మూడు పొరలతో కూడిన సిలిండర్లను రూపొందించారు. వీటినే కాంపోజిట్ సిలిండర్లు అని పిలుస్తున్నారు. లోపలిపొరను బ్లో–మోల్డెడ్ హై–డెన్సిటీ పాలిథిలిన్ (హెచ్‌డీపీఈ) తయారు చేస్తారు. దీనిపైన ఫైబర్ గ్లాస్‌తో కూడిన రెండవ పొరను ఏర్పాటు చేశారు. వీటిని కప్పుతూ మూడవ పొరగా హెచ్‌డీపీఈతో తయారు చేసిన జాకెట్ ఉంటుంది. ప్రస్తుతం వాడే ఉక్కు సిలిండర్ల బరువులో సగానికి కన్నా తక్కువగా ఉండడంతో పాటు ప్రమాద తీవ్రత ఉక్కు సిలిండర్లతో పోల్చితే 80నుంచి 90 శాతం తక్కువగా ఉంటుందని కంపెనీ స్పష్టం చేస్తోంది.

ప్రత్యేకతలు ఏమిటంటే...

అనుకోని సంఘటనలు జరిగినపుడు ప్రమాదాల తీవ్రతను 80నుంచి 90శాతం వరకు తగ్గించడంతో పాటు ఈ కాంపోజిట్ సిలిండర్లు అనేక ప్రత్యేకతలను కలిగి ఉన్నాయి. ఇవి పారదర్శకంగా ఉండడంతో సిలిండర్ లోపల ఎంత గ్యాస్ ఉంది, ఎంత అయిపోయింది తెలుసుకోవచ్చు. ఇవి తుప్పు పట్టవు ఇంటి లోపల మరకలు కావు. బరువు తక్కువగా ఉండడంతో ఒక చోటి నుంచి మరో చోటికి సులువుగా తీసుకుపోవచ్చు. ప్రస్తుతం ఇండేన్ గ్యాస్ డీలర్ల వద్ద ఈ సిలిండర్లు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ఇంటి అవసరాలకు వాడే సిలిండర్లో గ్యాస్ 14.2 కిలోలు ఉండగా కాంపోజిట్ సిలిండర్లలో 10 కేజీలు, 5 కేజీల పరిణామంలో లభ్యమవుతాయి. వీటిని కావాలంటే సెక్యూరిటీ డిపాజిట్‌గా 10కేజీల వాటికి 3500, 5కేజీల వాటికి 2200 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉక్కు సిలిండర్లు వాడే వారు డిపాజిట్ వ్యత్యాసాన్ని చెల్లించి ఉక్కు సిలిండర్ల నుంచి కాంపోజిట్ సిలిండర్లకు మారవచ్చు. సాధారణ సిలిండర్ల వలె వీటిని కూడా హోం డెలవరీ చేస్తారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని డీలర్లు అంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం వాడే గ్యాస్ సిలిండర్ పేలితే ప్రాణ, ఆస్తినష్టం తీవ్రంగా ఉంటుంది. వాటి స్థానంలో ప్రస్తుతం నూతన టెక్నాలజీతో తయారు చేసిన కాంపోజిట్ సిలిండర్లను ఉపయోగిస్తే ప్రమాద తీవ్రతను 80 నుంచి 90 శాతం వరకు తగ్గించవచ్చు. వినయోగదారులు ప్రస్తుత ఉక్కు సిలిండర్ల నుంచి కాంపోజిట్ సిలిండర్లకు సులువుగా మారే అవకాశాన్ని కంపెనీ కల్పించింది. విని యోగదారులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలి.

– కారింగుల అంజన్‌గౌడ్, ఇండేన్‌గ్యాస్ డీలర్, కోదాడ

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

డిండి : ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరంతర పోరాడుతుందని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. బీజేపీ కో హటావో దేశ్ కో బచావో అనే పేరుతో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన సీపీఐ ప్రచార యాత్రను డిండి మండల కేంద్రంలో ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నల్లగొండ జిల్లాలో ప్రారంభించిన డిండి లిఫ్ట్ పనులను పూర్తి చేసి దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఉన్న శ్రద్ధ డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే రిజర్వాయర్లపై ఎందుకు లేదని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టే ప్రజా వ్యతిరేక విధానాలతోపాటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయని హామీలను ప్రజలకు తెలియజేసేందుకే సీపీఐ ప్రచార యాత్రను ప్రారంభించామన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ఉజ్జిని యాదగిరిరావు, రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో విషాదం



హైదరాబాద్‌లోని కుషాయిగూడలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో భార్యా, కుమారుడితో సహా సజీవ దహనమైన మద్దిరాల మండలం రెడ్డిగూడేనికి చెందిన నరేష్ ఇంటి వద్ద రోదిస్తున్న బంధువులు, గ్రామస్తులు

స్థల వివాదం.. ముగ్గురిపై పలువురి దాడి



దాడి చేస్తున్న మున్నూరుకాపు సంఘం సభ్యులు

చౌటుప్పల్ : ప్లాట్ పంచాయితీలో ఓ సామాజిక వర్గానికి చెందిన పలువురు మారణాయుధాలతో ముగ్గురిపై దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన మండల పరిధిలోని తూప్రాన్‌పేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సీత పాండు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ గ్రామానికి చెందిన గందం రాజుకు మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలోని సర్వే నంబర్ 29లో 800గజాల స్థలం ఉంది. మూడేళ్లలో నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో తనస్థలం తిరిగి తీసుకుంటానన్న షరతుతో 2017లో మున్నూరు కాపు సంఘానికి గిఫ్ట్‌డీడ్ చేశాడు. అయితే, గడువు లోపు ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన తుప్పా భరత్‌కుమార్‌కు రాజు ఇటీవల ఆ ప్లాటును విక్రయించాడు. భరత్‌కుమార్ తన స్థలంలో ఈనెల 13న నిర్మాణ పనులు చేపట్టడంతో మున్నూరుకాపు సంఘం నాయకులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆరోజు ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించారు. ఆదివారం మరోసారి పనులు ప్రారంభించగా విషయం తెలుసుకున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు చక్రం జంగయ్య, వర్కూరి రాము, గందం సత్తయ్య, చక్రం రవీందర్, పగడాల పాండు, పగడాల యాదయ్య, వర్కూరి రాజు, గందం అంజనేయులు, పరిధం సురేష్‌లతోపాటు మరికొందరు వ్యక్తులు అక్కడకు చేరుకున్నారు. అక్కడే ఉన్న గందం రాజు, భరత్‌కుమార్‌లపై రాళ్లు, కర్రలు, ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను వీడియో చిత్రీకరిస్తున్న వర్కూరి గణేష్ అనే వ్యక్తిని కూడా గాయపరిచారు. అతడి సెల్ ఫోన్ ధ్వంసం చేశారు. దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు గందం రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. దాడిలో పాల్గొన్న మరికొందరిని గుర్తించాల్సి ఉందన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తదితరులు

మిర్యాలగూడ అర్బన్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన పట్టణంలోని సీతారాంపురంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురంలో నివాసముంటున్న జమీలాబేగం ఇంట్లో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగి సామగ్రికి మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. మంటలు ఇంటిని చుట్టిముట్టి వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికుల సహాయంతో మంటలను అదుపుచేసిన అనంతరం అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.10వేల రూపాయలను అందించారు. ప్రభుత్వం తరుపున ఆదకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ సలీం, షేక్ మదార్ బాబా, ఇంజం రాజేంద్రప్రసాద్, ఇమ్రాన్ తదితరులున్నారు.

అర్ధరాత్రి ఇంట్లో అగ్ని ప్రమాదం

సూర్యాపేట క్రైం : పట్టణంలోని విద్యానగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్‌తో ఏసీకి మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోగా బెడ్ రూమ్‌లోని మంచాలు, పరుపులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఇంటి యజమాని కృష్ణ ఒక్కడే ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఏసీ నుంచి మంటలు వస్తుండడాన్ని గమనించి బెడ్ రూమ్ నుంచి బయటపడడంతో ప్రాణాలను దక్కించుకున్నాడు. తాను బయటికి వచ్చాక మంటలతో మంచం పరుపులు దగ్ధమయ్యాయని తెలిపారు. పక్కింటి వారిని అప్రమత్తం చేయడంతో పైపుల ద్వారా నీళ్లు చల్లినా మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి అదుపు చేశారు. విద్యుత్ సిబ్బంది ఇంటికి పవర్ సప్లయ్ బంద్ చేయడంతో ప్రమాదం తప్పింది.

తాస్కానిగూడెం గ్రామస్తుల ఆందోళన విరమణ



బాలిక ఇంటి ఎదుట శివ మృతదేహం

చండూరు : చండూరు మండలం తాస్కానిగూడేనికి చెందిన అబ్బనబోయిన శివ (26) ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు, గూడెం వాసులు మృతదేహంతో అదే గ్రామానికి చెందిన మైనర్ ఇంటి ఎదుట చేపట్టిన ఆందోళనను ఆదివారం రాత్రి విరమించారు. శివ ఇదే గ్రామానికి చెందిన ఓ మైనర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ప్రేమ వ్యవహారంలో మైనర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరపకుండానే శివ ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బంధువులు ఆరోపించారు. కారకులపై చర్యలు తీసుకోవాలని శనివారం రాత్రి నుంచి ఆందోళన కొనసాగించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, మృతుడి కుటుంబాలతో పోలీసులు చర్చలు జరిపి బాధ్యులపై విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. సోమవారం శివ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలు ఆదివారం భువనగిరిలో వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాంనగర్‌లో అద్దెకు నివాసం ఉంటున్న పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో సుమారు రూ. 5 నుంచి రూ. 10 వేల వరకు, ఎల్‌బీనగర్‌లోని రాఘుల రవి ఇంట్లో బంగారంతో పాటు నగదును కలుపుకుని సుమారు రూ.5 లక్షల వరకు దుండగులు శనివారం అపహరించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాన్‌డబ్బాలో చోరీ

మాడుగులపల్లి: మండల కేంద్రంలోని ఓ పాన్‌డబ్బాలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 15 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు, పాన్ మసాలా సామగ్రి, రూ.3 వేల నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఇటీవల మండల కేంద్రంలో చోరీలు పెరిగాయని స్థానికులు అంటున్నారు. రాత్రివేళ పోలీస్ పెట్రోలింగ్ కరువైందని ఆరోపిస్తున్నారు.

కంపచెట్లలో చిక్కుకున్న వృద్ధుడు.. రక్షించిన పోలీసులు



ముత్తయ్యను వాహనంలో తరలిస్తున్న 108 సిబ్బంది

దేవరకొండ : కంపచెట్ల నడుమ చిక్కుకొని బయటికి రాలేక బిక్కుబిక్కుమంటున్న ఓ వృద్ధుడిని దేవరకొండ పోలీసులు స్థానిక యువకుల సహాయంతో రక్షించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుగొమ్ము మండలానికి చెందిన కూరాకుల ముత్తయ్య పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.ముత్తయ్య భార్య గతేడాది మృతిచెందింది.దీంతో ఇంటి సమీపంలోనే ఉంటున్న ముత్తయ్య తమ్ముడు అతని బాగోగులు చూస్తున్నాడు. కాగా, రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ముత్తయ్య ఆదివారం పట్టణ శివారులోని గాజీనగర్‌కు వెళ్లే మార్గంలో గల కంపచెట్లలో చిక్కుకొని బయటికి రాలేక తీవ్ర అవస్థపడ్డాడు. ఇది గమనించిన స్థానిక యువకులు ఇలియాస్,జానిలు దేవరకొండ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న బ్లూకోట్స్ సిబ్బంది శ్రీధర్, బాలాజీలు జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించి ముత్తయ్యను వెలికితీశారు. మాట్లాడలేకపోతున్న అతడిని 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్య చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు దేవరకొండ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ముత్తయ్య బహిర్భూమికి వెళ్లి కళ్లు సరిగా కనిపించక కంపచెట్లలో చిక్కుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని, రాజ్యాంగ రక్షణకు మరో పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు కొలిశెట్టి యాదగిరిరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం క్రాస్ రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'మనువాదాన్ని మట్టు పెడదాం– రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అనే నినాదంతో నిర్వహిస్తున్న ప్రచార జీపు జాతాను వారు ప్రారంభించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, నందిగామ సైదులు, బచ్చలకూర రాంబాబు, గోపి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం దామరచర్ల మండలం బాండావత్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గేరితండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆడావత్ పాశ్య (58) తన ఇంటి ఆవరణలో ఉన్న ఇనుప దండెం తీగకు బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పాశ్యను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రమణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేసవిలో లాభసాటిగా ఆకుకూరల సాగు

- కోదాడ డివిజన్ ఉద్యానశాఖ అధికారి అనిత



నడిగూడెం : ఆకు కూరలు సమీకృత పోషకాహారంలో చాలా ముఖ్యమైనవి. వీటిలో శరీరానికి అవసరమైన ఎన్నో పోషక పదార్థాలు మనకు లభిస్తాయి. రోజు ప్రతి ఒక్కరూ 125 గ్రాముల ఆకు కూరలను ఆహారంలో తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కోదాడ డివిజన్ ఉద్యానశాఖ అధికారి అనిత చెబుతున్నారు. అయితే ఆకు కూరల సాగులో రైతులకు ఇచ్చే సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే .. వేసవిలో అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. కొద్దిపాటి మెళకువలు పాటిస్తే ఆకు కూరల సాగుతో అధిక లాభాలు పొందవచ్చు. వేసవిలో తేమ నిలుపు కోగలిగిన బరువైన నల్లభూములు అనుకూలంగా ఉంటాయి. నీటి వసతి ఉంటే ఎర్రనేలలు, ఇసుక నేలలు ఎంపిక చేసుకోవాలి. ఆకు కూర మడులకు తుంపర్ల పద్ధతిలో నీటిని అందించాలి. నీటి సమర్థ వినియోగంతో పాటు ఆకుకూరల మడులను ఎండ తీవ్రత నుంచి కాపాడవచ్చు.

రకాలు : ముఖ్యంగా వేసవి సాగుకు సూచించిన రకాలను ఎంపిక చేసుకుంటే అవి నీటి ఎద్దడిని తట్టుకొని మంచి దిగుబడినిస్తాయి. వేసవి సాగుకు తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర, అనువైనవి.

తోటకూరలో : ఆర్.ఎస్.ఎ–1, అర్కాసుగుణ, పూసాకీర్తి, అర్కాఅరుణ, ఎరుపు

పాలకూరలో : ఆల్‌గ్రీన్, పూసా జ్యోతి, పూసాపాలక్,

మెంతికూర : పూసా ఎర్లీబంచింగ్, లాంసెలక్షన్–1



నడిగూడెం మండలం కరివిరాలలో సాగులో ఉన్న పాలకూర

కొత్తిమీర: సాధన, స్వాతి

గోంగూరలో : ఆంగ్రో–12, లోకల్, ఎర్ర గోంగూర రకాలను ఎంపిక చేసుకోవచ్చు.

విత్తడం

తోటకూర : 900–1000 గ్రాముల విత్తనం 10 కిలోల ఇసుకతో కలిపి ఒత్తుగా చల్లాలి. ఎకరాకు 20 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. కోత, కత్తిరింపు తర్వాత ఎకరాకు 10కిలోల నత్రజని అందించే ఎరువును వేసి నీరుపెట్టాలి.

పాలకూర : ఎకరాకు 12–15 కిలోల విత్తనం, వరుస వరుసకు 12సెం.మీ, మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 10కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి.

మెంతికూర : ఇసుక, మురుగు నీటి వసతి ఉన్న ఒండ్రు నేలల్లో పండించేందుకు అనుకూలం. 10–12 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనాన్ని వెదజల్లవచ్చు, లేదా వరుసలలో నాటవచ్చు. విత్తే ముందు విత్తనాన్ని నీటిలో నానబెట్టి వెదజల్లవచ్చు. ఎకరాకు 10కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి.

కొత్తిమీర : మురుగు నీటి సౌకర్యం కలిగిన బంకనేలలు అనుకూలం. విత్తే ముందు గింజలను రెండు బద్దలుగా చేయాలి. విత్తనాన్ని వెదజల్లడం లేదా వరుసలలో వేయాలి. ఎకరాకు 5–6 కలోల విత్తనాన్ని 15 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 4కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేయాలి.

ఎరువుల యాజమాన్యం

బాగా దుక్కి చేసిన నేలలో ఆఖరి దుక్కిలో ఎకరాకు 10–15 టన్నుల పశువుల ఎరువు 200 కిలోల వేప పిండి వేసి కలియదున్నాలి. వీలేనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వాటితో పాటు జీవన ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియ ఎరువుల వాడకం వలన నేల గుల్లబారి ఎక్కువ రోజులు తేమ నిల్వ ఉంటుంది. రెండు వరుసల మధ్య వరిగడ్డి, వేరుశనగ పొట్టు ఎండుటాకులు పరిస్తే నేలలో తేమ సంరక్షించబడును. ఆకు దిగుబడి పెంచడానికి 2శాతం యూరియా (20 గ్రాములు లీటరు నీటికి) జిబ్బరెల్లిక్ ఆమ్లం 50 మి.గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

సస్యరక్షణ చర్యలు

ఆకుకూరలను కూరగా వాడతారు కనుక వీలైనంత వరకు పురుగు మందులను వాడకపోవడమే మంచిది. వేప సంబంధిత పురుగు మందులను మాత్రమే వాడాలి. ముఖ్యంగా రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు పురుగుల నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి కార్బెండాజిమ్ 1 గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

గోంగూర : ఎకరాకు 6–8 కిలోల విత్తనాన్ని 60 సెం.మీ. ఎడంగా తయారు చేసుకున్న బోదెలో 30 సెం.మీ. దూరంలో వరుసలో విత్తుకోవాలి. ఎకరాకు 6కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి.

నీటి యాజమాన్యం

ఆకుకూరలు విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మళ్లీ మూడో రోజు నీరు పెట్టి నేల స్వభావాన్ని బట్టి తేలిక నేలలో 5–6 రోజుల వ్యవధిలో, బరువు నేలలో 8–10 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. తోటకూర విత్తిన తర్వాత నెమ్మదిగా నీటిని పారించాలి. లేకపోతే నీటితో విత్తనం కొట్టుకపోయి మొలకశాతం తగ్గుతుంది. ఆకు కూరల్లో దిగుబడి ముఖ్యంగా వేసవిలో నీటి యాజమాన్యంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రతి కోత తర్వాత పైపాటు ఎరువులు చల్లి నీరు పెట్టాలి.

కలుపు నివారణ : అన్ని ఆకుకూరల పంటల్లో కలుపు నివారణకు పెండిమిథాలిన్ ఎకరాకు 1.2 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 14 గంటల్లో పిచికారీ చేసి, 30 రోజుల వరకు కలుపు నివారించవచ్చు.